క్లుప్తంగా

ఇంటింటికీ వైద్యం



వృద్ధురాలిని పరీక్షిస్తున్న డాక్టర్ చంద్రకాంత్

నందవరం: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని పూల చింత గ్రామంలో డాక్టర్ చంద్రకాంత్ యాదవ్ ఇంటింటికి వెళ్లి వైద్య సేవలు అందించారు. దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులకు మందులు పంపిణీ చేశారు. బీపీ, షుగర్ వ్యాధి గ్రస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

500 ఎకరాల్లో పండ్ల తోటల సాగు

తుగ్గలి: ఉపాధి హామీ పథకం కింద ఈ ఏడాది మండలంలో 500 ఎకరాల్లో పండ్ల తోటల సాగు చేపడుతున్నట్లు ఏపీఓ రామకృష్ణ తెలిపారు. శనివారం ఆయన స్థానిక ఉపాధి కార్యాలయంలో మాట్లాడుతూ మండలంలో ఆయా గ్రామాల రైతుల నుంచి దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటిలో ఇప్పటికే 430 ఎకరాల్లో పండ్ల మొక్కల పెంపకానికి అనుమతులు రాగా మిగిలిన 70 ఎకరాలకు త్వరలో వస్తాయన్నారు. అనుమతులు వచ్చిన రైతులు పొలాల్లో గుంతలు తవ్వి మామిడి, చీనీ, నేరేడు వంటి పండ్ల మొక్కలు రైతులు నాటుతున్నారన్నారు. ఉపాధి పథకం కింద మూడేళ్ల పాటు మొక్కల సంరక్షణకు రైతుల ఖాతాలకు డబ్బు జమ అవుతాయన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న సీడీపీఓ సఫరున్నిసాబేగం

ఎమ్మిగనూరు రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం వ్యవహరిస్తే చర్యలు తప్పవని సీడీపీఓ సఫరున్నిసాబేగం హెచ్చరించారు. శనివారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన సమావేశంలో సీడీపీఓ మాట్లాడుతూ కేంద్రాల నిర్వహణతో పాటు రికార్డులు, పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ఇచ్చే పౌష్టికాహారం సక్రమంగా అందించాలన్నారు. కోడిగుడ్లు సన్నగా ఉన్నా, చెడిపోయిన వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కేంద్రాలకు అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు తప్పనిసరిగా డ్రెస్ కోడ్‌తో హాజరు కావాలన్నారు. సమావేశంలో సూపర్‌వైజర్లు, వర్కర్లు పాల్గొన్నారు.

‘ఉపాధి’పై సామాజిక తనిఖీ ప్రజా వేదిక




మాట్లాడుతున్న డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి

వెల్దుర్తి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి పనుల బహిరంగ సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఏప్రిల్ 2022–మార్చి 23 వరకు చేపట్టిన రూ.15.80 కోట్ల పనుల్లో రూ.77,345 అవినీతి జరిగినట్లు గుర్తించి డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి రికవరీకి ఆదేశించారు. సమావేశంలో వాటర్ షెడ్ ఏపీడీ సలీంబాషా, జిల్లా విజిలెన్స్ అధికారి (డీవీఓ) సిద్ధలింగమూర్తి, జెడ్పీటీసీ సుంకన్న, వెల్దుర్తి సర్పంచ్ ముత్యాల శైలజ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి షష్టి పూజలు

మద్దికెర: శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామికి శనివారం షష్టి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను అలంకరించి పంచామృతాభిషేకంతో పాటు మహామంగళ హారతి నిర్వహించారు. దేవసేన, శ్రీవల్లి సమేతుడై కొలువు తీరగా అర్చకులు హోమాలు నిర్వహించారు.

సేవాకార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న జిల్లా రోటరీక్లబ్ గవర్నర్

ఎమ్మిగనూరు టౌన్: సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలని రోటరీక్లబ్ జిల్లా గవర్నర్ నాగసతీష్ బాబు, రూరల్ సీఐ మోహన్ రెడ్డి సూచించారు. మాచాని సోమప్ప మెమోరియల్ హాల్‌లో శనివారం ఎమ్మిగనూరు రోటరీ క్లబ్ చార్టర్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా రోటరీ క్లబ్ చార్టర్ అధ్యక్షులుగా పద్మనాభరెడ్డి, కార్యదర్శిగా శ్రీనాథ్‌రెడ్డి, మాచాని వెంకటేష్‌లను ఎన్నుకుని క్లబ్ గుర్తింపు పత్రాన్ని అందజేశారు. అనంతరం నిర్వహించిన రక్తదాన శిబిరంలో సీఐతో పాటు పలువురు యువకుకు రక్తదానం చేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆరుద్ర వచ్చేసింది!

- ప్రారంభమైన విత్తన కార్తెలు
- జూలై నెలాఖరు వరకు అదును
- వరుణుడు కరుణిస్తే జోరుగా ఏరువాక



పెండేకల్లు వద్ద అరకొర పదునులోనే వేరుశనగ విత్తనం వేస్తున్న దృశ్యం

తుగ్గలి: మృగశిర ముగిసి మూడు రోజులైంది. ఈనెల 22 నుంచి ఆశల ‘ఆరుద్ర’ ప్రారంభమైంది. ఆరుద్రతోనే ముంగారు(ఖరీఫ్) విత్తన కార్తెలు ప్రారంభమవుతాయి. ఆ తర్వాత పునర్వసు, పుష్యమి కార్తెలు కూడా పంటల సాగుకు అనుకూలమని రైతులు భావిస్తారు. అయితే ప్రధానంగా ఆరుద్ర, పునర్వసు కార్తెల్లో భూమిలో విత్తనం పడితే మంచి పంట దిగుబడులు వస్తాయనే నమ్మకంతో ఈ రెండు కార్తెల్లోనే వేరుశనగ, ఇతర పంటలు విత్తనం వేస్తారు. నియోజకవర్గంలో 90వేల హెక్టార్లలో పంటలు సాగు చేస్తారు.

పదునైతే జోరుగా ఏరువాక

ప్రస్తుతం మోస్తరు జల్లులు మినహా ఇంత వరకు మంచి వర్షాలు కురవలేదు. దీంతో రైతులు విత్తనం వేయడానికి మంచి పదును కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే రైతులు పొలాలు దుక్కిదున్ని విత్తుకు సిద్ధం చేశారు. విత్తనాలు, ఎరువులు తెచ్చిపెట్టుకున్నారు. నైరుతీ రుతుపవనాలు ప్రవేశించినా.. ఇంకా ప్రభావం చూపకపోవడంతో ఆశించిన మేర వర్షాలు పడలేదు. ఉష్ణోగ్రతలు కొద్దిమేర తగ్గి గాలులు మొదలయ్యాయి. దీంతో అడపాదడపా కమ్ముకున్న మేఘాలు కూడా చెదిరిపోతున్నాయి. మృగశిర కార్తె చివర్లో కురిసిన మోస్తరు జల్లులకు అక్కడక్కడా అరకొర పదునులోనే ఆముదం, వేరుశనగ విత్తనం విత్తుతున్నారు.

ఆరుద్రకు విశిష్టత..

పంటల సాగుకు ఆరుద్రకు చాలా సంబంధం ఉందని రైతులు నమ్ముతారు. ఆరుద్ర వర్షం అమృతంతో సమానమని, ఆరుద్ర వాన ఆదాయాల బాన అంటుంటారు. ఆరుద్రలో వర్షం వస్తే వచ్చే ఆరు కార్తెల్లోనూ వాన వస్తుందని రైతులు భావిస్తారు. అందుకే ఈ కార్తెలోనే రైతులు ముంగారు సాగుకు దిగుతారు. రుతుపవనాల ప్రభావం సాధారణంగా జూన్ నుంచి సెప్టెంబర్ నెలాఖరు వరకు ఉంటుంది. నాలుగు నెలల్లో 141.6 మి.మీ సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. అందులో జూన్‌లో 94 మి.మీ, జూలైలో 97 మి.మీ, ఆగస్టులో 97.6 మి.మీ, సెప్టెంబర్‌లో 141 మి.మీ మేర వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. సాధారణ వర్షపాతంలో 75 శాతం వర్షపాతమైనా నమోదైతే పంటల సాగు, దిగుబడులకు ఢోకా ఉండదని రైతులు నమ్ముతారు. కాగా జూన్‌లో 94 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 17 మి.మీ వర్షం మాత్రమే కురిసింది. వారం రోజులుగా వాతావరణ పరిస్థితుల్లో కొంత మార్పు వచ్చింది. పది రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉందని రైతులు ఆశిస్తున్నారు.

వర్షం కోసం ఎదురుచూస్తున్నాం



మేము 16 ఎకరాల్లో పత్తి, ఆముదం పంట వేసేందుకు పొలాన్ని దుక్కిదున్ని విత్తుకు సిద్ధం చేశాం. పోయినేడాది ఈ పాటికే విత్తనం వేసింటిమి. ఈసారి ఇంత వరకు పదునైన వానేలేదు. ప్రభుత్వం ముందుగానే పెట్టుబడి సాయం రూ.5.500 అందించింది. పదునైన వాన పడగానే విత్తనం వేస్తాం.

– పొన్నే రామాంజనేయులు, రైతు, ఎద్దులదొడ్డి

ఆందోళన అవసరం లేదు



జూలై 15 వరకు వేరుశనగ విత్తనం విత్తుకునే అవకాశం ఉన్నందున రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఆరుద్ర కార్తె ప్రారంభమైనందున వచ్చే రెండు కార్తెలు కూడా సాగుకు అనుకూలమైనవే. మూడేళ్లుగా ముందుగానే రైతులకు నాణ్యమైన విత్తనాలు అందజేశాం. ఆర్‌బీకేల్లో ఎరువులు కూడా సిద్ధం చేశాం. అరకొర పదునులో రైతులు విత్తనం విత్తుకోకుండా మంచి వర్షాలు పడిన తర్వాతే విత్తనం వేసుకోవాలి.

– పవన్‌కుమార్, ఏఓ, తుగ్గలి

ప్రియుడి ఇంటి ఎదుట ధర్నా



ప్రియుడి ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న యువతి

నందవరం: ప్రేమ పేరుతో తనను మోసం చేశాడంటూ ముగతి గ్రామానికి చెందిన ఓ యువతి అదే గ్రామానికి చాకలి రాఘవేంద్ర ఇంటి ఎదుట శనివారం ధర్నాకు దిగింది. పెళ్లి చేసుకుంటానంటూ రెండేళ్లుగా కాలయాపన చేసి ఇప్పుడు తల్లిదండ్రులు ఒప్పుకోవడం లేదని బుకాయిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ తిమ్మయ్య ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. విచారణ చేపట్టి న్యాయం చేస్తానాన్ని హామీ ఇవ్వడంతో బాధితురాలు ధర్నా విరమించింది. కాగా బాధితురాలికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక నాయకురాలు మద్దతు తెలిపారు.

ఫీజు దోపిడీపై నిరసన

గోనెగండ్ల: ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజు దోపిడీపై ఏఐఎస్ఎఫ్ నాయకులు శనివారం ఎంఈఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. రెగ్యులేషన్ కమిటీని పటిష్టంగా అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ తాలూకా అధ్యక్షుడు మునిస్వామి డిమాండ్ చేశారు.

పేదల అభ్యున్నతే ధ్యేయం

ఎమ్మిగనూరుటౌన్: పేదల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన 24వ వార్డులో వార్డు ఇన్‌చార్జ్ రుద్రాక్షల బజారి, కౌన్సిలర్ రామాంజనమ్మ, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డితో పర్యటించారు. పాలన గురించి ఆరా తీశారు. ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించి బుక్‌లెట్‌ను అందించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇచ్చిన మాట తప్పకుండా అన్ని హామీలు నెరవేర్చిన ముఖ్యమంత్రి జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, మున్సిపల్ వైస్ చైర్మన్లు పాల్గొన్నారు.



మహిళకు సంక్షేమ బుక్‌లెట్ అందజేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

- పట్టణంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సచివాలయ సిబ్బంది పక్కాగా చేయాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని మల్లారి వీధి, ముగతి పేటలో చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వారు పరిశీలించారు.

సమస్యల పరిష్కారానికే ‘గడప గడపకు’

- ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండ రూరల్: సమస్యల పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శనివారం మండల పరిధిలోని పందికోన గ్రామంలో ఆమె రెండోరోజు పర్యటించి ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. నాలుగేళ్లలో ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరిస్తూ సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణదాస్, వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ అధికార ప్రతినిధి శ్రీరంగడు, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, ఎంపీడీఓ కవిత, సీఐ మురళీమోహన్, గ్రామ నాయకులు రవి, మల్లికార్జున, తిమ్మరాజు, బాలరాజు, నారాయణస్వామి పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

ఆలయ అభివృద్ధికి కృషి చేయండి

మద్దికెర: ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పాలకమండలి సభ్యులకు సూచించారు. మండల పరిధిలోని పెరవలి శ్రీరంగనాథస్వామి ఆలయ పాలకమండలి చైర్మన్‌గా ఈడిగ దస్తగిరి గౌడ్, కమిటీ సభ్యులుగా లక్ష్మిరెడ్డితో పాటు మరో ఏడుగురిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో వారితో శనివారం ప్రమాణస్వీకరం చేయించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, పత్తికొండ మార్కెట్ యార్డు చైర్మన్ పక్కీరప్ప, సర్పంచ్ మల్లికార్జున, ఉపసర్పంచ్ గోపాల్, సొసైటీ అధ్యక్షుడు శాంతన్న తదితరులు పాల్గొన్నారు.



పాలకమండలితో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

ముగతిలో చోరీ



బాధితుడి నుంచి వివరాలు సేకస్తున్న ఎస్ఐ తిమ్మయ్య

నందవరం: మండల పరిధిలోని ముగతి గ్రామంలో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామంలోని రామలక్ష్మన్న ఆలయం వీధిలో నివాసం ఉంటున్న గొల్ల పెద్ద రాముడు కుమారుడు పవన్ శుక్రవారం రాత్రి భోజనానంతరం కుటుబ సభ్యులతో కలిసి ఇంటిపై నిద్రకు ఉపక్రమించారు. అర్ధరాత్రి దుండగులు ఇంటి తాళం పగులగొట్టి లోపలకు ప్రవేశించి బీరువాలో ఉన్న రూ.60 వేల నగదు, 2 తులాల బంగారు(టిక్కి, ఉంగారం), 80 తులాల వెండి(కడియాలు, కాళ్ల పట్టీలు)తో పరారయ్యారు. శనివారం ఉదయం బాధితుడు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ తిమ్మయ్య ఘటనా స్థలానికి చేరుకుని బాధితుడి నుంచి వివరాలు సేకరించి, కేసు నమోదు చేసుకున్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

ఎమ్మిగనూరు రూరల్: పట్టణంలోని కడివెళ్ల గ్రామ సమీపంలో బైక్‌పై అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నట్లు సెబ్ సీఐ జయరాంనాయుడు తెలిపారు. శనివారం స్థానిక సెబ్ కార్యాలయం ఆవరణలో పట్టుబడిన మద్యం, బైక్, నిందితులను అరెస్ట్ చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని కడివెళ్ల గ్రామ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా కందనాతి ఎరుకుల సుంకన్న, కడివెళ్ల సమరసింహారెడ్డి బైక్‌పై కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. బైక్, 5 బాక్సుల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. సమావేశంలో సెబ్ ఎస్ఐ సోమశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ఆలూరు రూరల్: మొలగవల్లిలో పులికొండ (45) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన పులికొండ కొంతకాలంగా మద్యానికి బానిస అయ్యాడు. ఈక్రమంలో శనివారం తెల్లవారు జామున ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నాడు.



మంత్రికి వినతి

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్‌ను ఆలూరులోని ఆయన నివాసంలో శనివారం ప్రజాసంఘాల నాయకులు నారాయణస్వామి, షాకీర్, మైనా తదితరులు కలిశారు. హాలహర్వి మండలం కొక్కెరచేడు గ్రామంలో ఉన్న బీసీ సంక్షేమ వసతి గృహాన్ని ఆలూరుకు మార్చాలని వినతి పత్రం అందజేశారు.

– ఆలూరు

భరోసా కల్పించాలి

ఎమ్మిగనూరుటౌన్: చర్మకార వృత్తి దారుల జీవితాలకు భరోసా కల్పించాలని ఆ సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు ఆనంద్‌బాబు కోరారు. శనివారం పద్మశాలి కళ్యాణ మండపంలో నిర్వహించిన ఏపీ చర్మకార వృత్తి దారుల మొదటి జిల్లా మహా సభలో ఆయన మాట్లాడారు.

విద్యుత్ తీగలు తగిలి బాలుడికి గాయాలు



గాయపడిన చరణ్

ఎమ్మిగనూరు రూరల్: విద్యుత్ తీగలు తగిలి ఓ బాలుడికి గాయాలైన ఘటన మండల పరిధిలోని గుడేకల్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. మల్లారిపేటకు చెందిన వీరేష్, శంకరమ్మల మనవడు చరణ్(8) సాయంత్రం బసవన్న స్వామి ఆలయం వద్ద ఆటలాడుకుంటుండగా ఓ పిల్లాడు చెప్పును ఆలయంపైకి విసిరాడు. చరణ్ ఆలయం పైకి ఎక్కి చెప్పు తీసుకుని వచ్చే క్రమంలో వేళాడుతున్న విద్యుత్ తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. కాలనీ వాసులు కాపాడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం 108లో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అర్హులకు లబ్ధి చేకూర్చేందుకే జగనన్న సురక్ష

అర్హులందరికీ లబ్ధి చేకూర్చేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. శనివారం ఎమ్మిగనూరు, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. అధికారులు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించారు. స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల అర్జీలను సంఘటితం చేసి ఇంకా పరిష్కారం కాని వాటిని జగనన్న సురక్ష కింద పరిష్కారించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని దైవందిన్నె గ్రామంలోని సచివాయంలో తహసీల్దార్ కె.ఆంజినేయులు ఉద్యోగులతో సమావేశమై కార్యక్రమంపై ఉద్యోగులకు సూచనలిచ్చారు. ఈఓఆర్డీ విజయలక్ష్మి పాల్గొన్నారు.

నందవరం: మండలంలోని మాచాపురం గ్రామంలో ఎంపీడీఓ దశరథ రామయ్య, గురజాలలో తహసీల్దార్ నిత్యానందరాజు పర్యటించి వివరాలు సేకరించారు.

ఆస్పరి: ఆస్పరి, యాటకల్లు గ్రామాల్లో తహసీల్దార్ కుమారస్వామి, ఎంపీడీఓ రాణెమ్మ పర్యటించారు. వలంటీర్లు, సచివాలయం సిబ్బందితో కలిసి వివరాలు సేకరించారు.

హాలహర్వి: మండలంలోని అర్దగేరి, గూళ్యం గ్రామాల్లో మండల ప్రత్యేకాధికారి రామాంజనేయులు, ఎంపీడీఓ ఆంథోనీ, తహసీల్దార్ మల్లికార్జున పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

హొళగుంద: ఇంగళదహాళ్‌లో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధ పర్యటించి వివరాలు సేకరించారు.

తుగ్గలి: తహసీల్దార్ రవి బృందం కడమకుంట్లలో, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ సూర్య నారాయణ బృందం బొందిమడుగులలో ఇంటింట సర్వేలో పాల్గొంది.


కృష్ణగిరి: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ విశ్వమోహన్, తహసీల్దార్ పురుషోత్తం మండల పరిధిలోని కంబాలపాడు, లక్కసాగరం గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.

మద్దికెర: ఎంపీడీఓ నరసింహమూర్తి, తహసీల్దార్ నాగభూషణం శనివారం మండల పరిధిలోని బసినేపల్లి గ్రామంలో ఇంటింటి సర్వే చేపట్టారు.

ఉపాధ్యాయుల నిర్లక్ష్యం వల్లే గిరిజన పాఠశాలలు మూత

- ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ మల్లికార్జున రెడ్డి

ఆలూరు రూరల్: ఉపాధ్యాయుల నిర్లక్ష్యం వల్లే స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాలలు (బాలుర, బాలికల) మూత పడ్డాయని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ మల్లికార్జున రెడ్డి అన్నారు. వంట నిర్వాహకులు లేని కారణంగా విద్యార్థులు పాఠశాలలకు రావడం లేదని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో శనివారం ఆయన పాఠశాలలకు చేరుకుని విచారణ చేపట్టారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గతంలో వంట నిర్వాహకులను నిబంధనలకు విరుద్ధంగా నియమించారన్నారు. కొన్ని రోజుల పాటు వీరికి ఎస్టీ వెల్ఫేర్ ఫండ్ నుంచి కొంత మొత్తాన్ని చెల్లించామన్నారు. వంట నిర్వాహకులను అప్కాస్‌లోకి తీసుకోవాలని ఫైల్ సిద్ధం చేశామన్నారు. ప్రస్తుతం ఇక్కడ ఇద్దరు వర్కర్లు, ఒక వాచ్‌మెన్, కామాటి పనిచేస్తున్నా.. గతంలో పనిచేసిన వంట నిర్వాహకులను రెగ్యులర్ చేయాలనే ఉద్దేశంతో హెచ్ఎం, ఉపాధ్యాయులు వంట నిర్వాహకులు లేరని తప్పుడు సమాచారం ఇచ్చి పాఠశాల మూత వేశారన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పూర్తి స్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట జిల్లా ఎస్సీ ఈడీ శ్రీనివాస్ కుమార్ ఉన్నారు.



విచారణ చేస్తున్న ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ మల్లికార్జున రెడ్డి

తెరుచుకున్న గిరిజన ఆశ్రమ పాఠశాలలు

ఉన్నతాధికారుల చొరవతో శనివారం ఆలూరు గిరిజన బాలుర, బాలికల ఆశ్రమ పాఠశాలల్లో తరగతులు ప్రారంభమయ్యాయి. గిరిజన బాలుర పాఠశాలలో 250 మంది, గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో 310 విద్యార్థులు ఉన్నారు. ప్రస్తుతం పాఠశాలలో పనిచేస్తున్న నలుగురు వర్కర్లతో వంట చేయించేలా చర్యలు తీసుకున్నారు.

నర్సింగ్ హోంలపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: బిడ్డ అడ్డం తిరిగిందని, ఉమ్మ నీరు తాగిందని, ద్వారం చిన్నగా ఉందని భయపెట్టి సిజేరియన్లు చేసి వేలకు వేలు గుంజుకునే ప్రైవేట్ నర్సింగ్ హోంలపై చర్యలు తీసుకోవాలని ఏపీ మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి ఈరమ్మ కోరారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు.

సంక్షిప్తం

అన్ని అనుమతులతోనే జగనన్న స్మార్ట్‌టౌన్‌షిప్

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మిగనూరు, ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, మధ్య తరగతి ప్రజల కోసం బనవాసి వద్ద అన్ని అనుమతులతోనే జగనన్న ఎంఐజీ స్మార్ట్ టౌన్‌షిప్‌లో ప్లాట్లు విక్రయిస్తున్నట్లు కుడా వైస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. స్మార్ట్‌టౌన్ షిప్‌కు కేటాయించిన భూమి అటవీశాఖది కాదని, పశుసంవర్ధక శాఖ పరిధిలోనిదన్నారు. పశుసంవర్ధక శాఖకు ఎకరాకు రూ.35 లక్షల ప్రకారం చెల్లించి 110 ఎకరాల భూమిని ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. కొనుగోలుదారులు నిర్భయంగా ప్లాట్లను తీసుకోవచ్చున్నారు. సమావేశంలో కుడా ప్లానింగ్ ఆఫీసర్ విజయభాస్కర్, అసిస్టెంట్ పీఓ రాజేష్ పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించండి

మద్దికెర: జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలో ఆశా, ఆరోగ్య కార్యకర్తలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సిబ్బందితో కలిసి ప్రభుత్వ వైద్యాధికారి శ్రీలక్ష్మి ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించాలని వైద్యసిబ్బందికి సూచించారు.

వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

గోనెగండ్ల: వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ వైకేపీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సి.బసవరాజు కోరారు. శనివారం గాజులదిన్నె ప్రాజెక్టు వద్ద ఏపీ వైకేపీ వీఓఏల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ముగిసిన విత్తన పంపిణీ

కృష్ణగిరి: సబ్సిడీ వేరుశనగ విత్తన పంపిణీ కార్యక్రమం ముగిసినట్లు మండల వ్యవసాయ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కడివెళ్ల ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి 7, 8, 9వ తరగతల విద్యార్థులు ఈనెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాఘవేంద్ర కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ 7వ తరగతికి 16, 8వ తరగతికి 15, 9వ తరగతికి 18 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు.

గోనెగండ్ల: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లోని 7, 8, 9వ తరగతులల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ షాహినా పర్వీన్ శనివారం తెలిపారు. ఒక్కో సీటు మాత్రమే ఖాళీగా ఉన్నాయన్నారు. దరఖాస్తులను ఈనెల 27వ తేదీ లోపు పాఠశాల వద్ద అందజేయాలన్నారు. ప్రవేశ పరీక్ష మోడల్ స్కూల్‌లోనే ఈనెల 28న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుందన్నారు.

మద్దికెర: స్థానిక మోడల్ స్కూల్‌లోని 7, 8, 9 తరగతుల్లో ప్రవేశానికి జూలై 4వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సవిత శనివారం తెలిపారు. ప్రవేశపరీక్ష జూలై 7న ఉంటుందన్నారు.

పొట్టేళ్ల పందెంరాయుళ్లపై కేసు నమోదు

మద్దికెర: మండల కేంద్రం శివార్లలోని నల్లరేగడి పొలా ల్లో పొట్టేళ్ల పందెం శిబిరంపై పోలీసులు శనివారం సోదాలు నిర్వహించారు. ఎస్ఐ మహమ్మద్ రిజ్వాన్ తెలిపిన వివరాలు.. పొట్టేళ్ల పందెం ఆడుతున్న మద్దికెర, చిప్పగిరి, సంగాల, నేమకల్లు గ్రామస్తులు 20 మందిపై కేసు నమోదు చేసి, రెండు పొట్టేళ్లను స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పరిచామన్నారు.

బక్రీద్ ప్రశాంతంగా జరుపుకోవాలి

హొళగుంద: బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సూచించారు. శనివారం ఆయన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు, హొళగుంద ఎస్ఐ శ్రీనివాసులు, తహసీల్దారు మూసేస్‌సాహెబ్‌లతో కలిసి హిందూ, ముస్లింలతో పాటు గ్రామపెద్దల తో నిర్వహించిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు.

గోనెగండ్ల: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ తిమ్మారెడ్డితో కలిసి ఎమ్మిగనూరు రూరల్ సీఐ మోహన్ రెడ్డి ముస్లిం మత పెద్దలు, ప్రజా సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.

నందవరం: బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ మోహన్ రెడ్డి సూచించారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన పీఎస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.

మార్కెట్ కమిటీలో షాపింగ్ కాంప్లెక్స్ పనులు

ఆలూరు: ఎల్లార్తి రోడ్డు సమీపంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో షాపింగ్ కాంప్లెక్స్ పనులను నిర్మించేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపుతామని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మనూరు నారాయణ తెలిపారు. స్థానిక యార్డులో శనివారం ఏర్పాటు చేసిన కమిటీ డైరెక్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.

వేతనాల చెల్లింపునకు చర్యలు

తుగ్గలి: రాతన ఆశ్రమ పాఠశాలలో రోజువారీ వేతనదారులకు పెండింగ్ వేతనాల చెల్లింపునకు చర్యలు తీసుకుంటామని గురుకుల పాఠశాలల జాయింట్ సెక్రటరీ ఎం.రమణమూర్తి తెలిపారు. కుక్, కమాటీ లేక పోవడంతో రోజు వారీ కింద ఐదుగురు వేతనదారులు వేతనాలు చెల్లింపులో జాప్యం కారణంగా వంట చేయడం మానేశారని తెలిసి పాఠశాలను సందర్శించామన్నారు. వేతనదారులతో మాట్లాడి శనివారం వంట చేయడం పునరుద్ధరించారన్నారు. విద్యార్థులను చేర్చుకోవాలని ప్రిన్సిపాల్ మునిశిలయ్య, హెచ్ఎం రాముడును ఆదేశించామన్నారు. ఆయన వెంట డిప్యూటీ సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి, డీటీడబ్ల్యూఓ జగన్నాథరావు ఉన్నారు.

అనుమతుల్లేని వెంచర్లపై చర్యలు

ఎమ్మిగనూరుటౌన్: అనుమతుల్లేకుండా వెంచర్లు వేసిన వారిపై చర్యలు తీసుకుంటామని కుడా వైస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం పట్టణంతో పాటు గుడికల్,కలుగొట్ల గ్రామాల పరిధిలోని అక్రమ వెంచర్లను పరిశీలించారు.

పంటల సాగుకు సమయముంది

గోనెగండ్ల: వర్షాలు రాలేదని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పంటల సాగుకు ఇంకా సమయం ఉందని వ్యవసాయ సంచాలకులు ఎస్ ఎండీ ఖాద్రీ, ఏఓ హేమలత రైతులకు సూచించారు. శనివారం వారు వ్యవసాయ కార్యాలయంలో మాట్లాడారు.